సాక్షి
జోగులాంబ గద్వాల
బుధవారం । 4 । డిసెంబర్ । 2024



అప్పులు తీర్చేందుకు..
తోటి వ్యాపారిని హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.
వివరాలు 8లో ▸



దాడులను అరికట్టాలి
ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలని సంఘాల నాయకులు అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /23.0

వాతావరణం
ఉదయం, సాయంత్రం చల్లని గాలులు వీస్తాయి. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది.

ప్రతిభ చాటేనా..?

నేడే జాతీయ సాధన సర్వే (నాస్) పరీక్ష



కేటీదొడ్డి ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

- 3, 6, 9వ తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లాలో పరీక్ష రాయనున్న 5,488 మంది విద్యార్థులు
- 84 సెంటర్లలో పరీక్ష నిర్వహణ

జిల్లాలో పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల వివరాలిలా..

తరగతి	మొత్తం విద్యార్థులు	పరీక్ష రాసే వారు	పరీక్ష సెంటర్లు
3వ	6,166	1,137	26
6వ	5,272	1,900	25
9వ	6,248	2,451	33

గద్వాల (గద్వాల టౌన్): విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయి.. పాఠ్యాంశాలు ఏ మేరకు నేర్చుకుంటున్నారు.. విద్యా ప్రమాణాలు అమలు తీరు.. విద్యా విధానం ఎలా ఉంది.. ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు జాతీయ సాధన సర్వే (నాస్) సమాచారం చెప్పనుంది. మూడేళ్లకోసారి దీనిని నిర్వహిస్తారు. ఈ ఏడాది నుంచి పేరును పరక్ (ఫర్ఫామెన్స్, అసెస్‌మెంట్, రివ్యూ- అనాల్సిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్)గా మార్చారు. జాతీయ స్థాయిలో పరీక్ష జరగనుండగా.. జిల్లాలో నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. పరీక్షల నిర్వహణలో భాగంగా సమన్వయకర్తగా డీఈఓ వ్యవహరించనున్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకు..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలకు పరీక్ష జరగనుంది. 3, 5, 8, 10 తరగతుల విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పరిశీలించడానికి న్యాస్ పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యాశాఖ విద్యార్థులను ముందు నుంచే సన్నద్ధం చేసింది. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఇప్పటికే మూడు నమూనా పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు వివిధ స్థాయిలో సాధన చేయించారు. హెచ్‌ఎం, ఎంఈఓలకు దిశానిర్దేశం చేసి.. గత ఆగస్టు నుంచి ఉపాధ్యాయులకు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. అయితే తాజాగా బుధవారం జరిగే పరీక్షలో ప్రత్యేక ప్రతిభ చూపేలా.. ప్రణాళిక అమలు చేస్తున్నారు. 3, 6 తరగతుల వారికి గణితం, ఈవీఎస్, భాషా నైపుణ్యాలు, 9వ తరగతి గణితం, సాంఘిక, సామాన్య శాస్త్రం, భాషా నైపుణ్యాలు ఉంటాయి. బహుల ప్రశ్నల ద్వారా ప్రతిభను గుర్తించనున్నారు.

5488 మంది విద్యార్థులు.. 84 సెంటర్లు

జిల్లా వ్యాప్తంగా 5488 మంది విద్యార్థులు హాజరువుతండగా 84 సెంటర్లను ఎంపిక చేశారు. ఈమేరకు జిల్లా అధికారులు పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు పరీక్ష నిర్వహించనున్నారు. ఆయా తరగతుల్లోని విద్యార్థులు భాష, గణితం, సోషల్, సైన్స్, క్రిటికల్ థింకింగ్ అంశాలపై ప్రశ్నలకు సమాధానాలు ఓఎంఆర్ షీట్‌లో గుర్తించాల్సి ఉంటుంది. పరీక్ష నిర్వహణకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్, అబ్జర్వర్లు, జిల్లా కోఆర్డినేటర్లు, సహాయ కోఆర్డినేటర్లను నియమించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ ప్రక్రియ పర్యవేక్షించనున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఒకేరోజు న్యాస్ సాధన సర్వే నిర్వహించనున్నారు.

మూడు తరగతుల విద్యార్థులకు..

- జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న 3, 6,9 తరగతుల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై పరీక్ష నిర్వహిస్తారు.
- 3వ తరగతి గణితం, ఈవీఎస్, ఆంగ్లం, తెలుగులో 6వ తరగతిలో గణితం, ఈవీఎస్, తెలుగు, ఉర్దూ సబ్జెక్టులు, 9వ తరగతికి గణితం, ఆంగ్లం, సాంఘిక, సైన్స్, తెలుగు సబ్జెక్టులో బహుళైచ్ఛిక ప్రశ్నల ద్వారా పరీక్ష నిర్వహిస్తారు.
- జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఆగస్టు నుంచి నాస్ పరీక్ష కోసం ఉపాధ్యాయులు రెగ్యూలర్ తరగతులను కొంత పక్కన పెట్టి సన్నద్ధం చేశారు. ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చింది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలో బుధవారం నిర్వహించే నాస్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షకు రెండు నెలల నుంచే విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దడం జరిగింది. ఇప్పటికే విద్యార్థులకు ఆచరణాత్మక సూచనలు అందించడంతో పాటు నమునా పరీక్షలు నిర్వహించి సన్నద్ధం చేశాం. – అబ్దుల్ ఘని, డీఈఓ

సమగ్ర కుటుంబ సర్వే ప్రభావం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబం సర్వేకు సంబంధించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఎన్యుమరేటర్లుగా విధులు నిర్వహిస్తుంచారు. మద్యాహ్నం వరకే పాఠశాలల్లో విద్యాబోధన చేసి ఆ తర్వాత సర్వే విధుల్లో పాల్గొన్నారు. దీంతో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల బోధనపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. అయితే ఇందులో న్యాస్ పరీక్ష రాయబోతున్న 3వ తరగతి విద్యార్థులపై కొంత ప్రతికూల ప్రభావం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూస్‌రీల్

రేపు ఆదిశిలా క్షేత్రంలో మహాకుంభాభిషేకం



గద్వాల (మల్దకల్): ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న ధ్వజస్తంభ ప్రతిష్టాపనతో పాటు వివిధ కార్యక్రమాలను పీఠాధిపతుల చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. ఈ కుంభాభిషేకం నిర్వహణలో భాగంగా మంగళవారం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి మహాహోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అరవిందరావు, నాగరాజు శర్మ, చంద్రశేఖర్‌రావు, బాబురావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గద్వాల క్రైం: జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం గద్వాల కోర్టు హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోడుమూర్ అశోక్‌కుమార్‌రెడ్డి, సభ్యులుగా వీరవసంతుడు, సయ్యద్ బాషా, అశోక్‌కుమార్, పుష్పలత, ఇర్షాద్, రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని జిల్లా జడ్జి కె కుషా సన్మానించారు.

పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు



గద్వాల (మల్దకల్): రైతులు పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని డీఆర్‌డీఓ నర్సింగరావు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దొడ్డి గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా తక్కువ ఖర్చుతో పంట సాగు విధనంపై అవగహన కల్పించారు. పంటలకు ఆశించే చిడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే భూమి సారవంతంగా ఉంటుందని, వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరిగా రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, టీఏలు నాగరాజు, అనుష, రైతులు పాల్గొన్నారు.

రేపు పీయూలో ప్రాంగణ ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పీయూ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహిస్తారని, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు సెమినార్‌హాల్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

‘108’లో రేపు ఇంటర్వ్యూలు

జడ్చర్ల: జిల్లాలో 108, 102 అంబులెన్స్‌లలో డ్రైవర్ ఉద్యోగాల మరియు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ ఉద్యోగాల కోసం 10వ తరగతి విద్యార్హత, డ్రైవర్ లైసెన్స్‌తో పాటు మూడేళ్ల అనుభవంతో 35 ఏళ్ల లోపు వయసు వారు అర్హులని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బీఎస్సీ లైఫ్ సైన్స్,బీఎస్సీ ఎంఎల్‌టీ, బీఎస్సీ నర్సింగ్,జీఎన్‌ఎం,ఏఎన్‌ఎం, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ ఏదో ఒక కోర్సులో విద్యార్హతలు కలిగి ఉండి 30ఏళ్ల లోపు గల అభ్యర్థులు గురువారం జిల్లాకేంద్రంలోని 108 కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 91007 99527 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విజయానికి అంగవైకల్యం అడ్డుకాదు



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల: విజయానికి అంగవైకల్యం ఏ మాత్రం అడ్డుకాదని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంతో మంది దివ్యాంగులు కష్టపడి ఎన్నో విజయాలు సాధించారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోని ముందుకెళ్లాలన్నారు. దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. దివ్యాంగులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వీటిపై మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయి చెస్‌పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన వీరేష్, అర్చన, మాధవ్, జిల్లా స్థాయి క్రీడల్లో గెలుపొందిన 26మంది దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఉపాధి హామీ దివ్యాంగ కూలీలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పీ సీఈఓ కాంతమ్మ, డీడ బ్ల్యూఓ సుధారాణి, డీసీపీఓ నర్సింహ్మా పాల్గొన్నారు.



గద్వాలలో 2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ తదితరులు

ఉత్సాహంగా 2కే రన్

గద్వాల: రాష్ట్ర ప్రభుత్వ ఏడాది ప్రజా పాలన విజయోత్సవం.. మున్సిపల్ శాఖ అర్బన్ డేను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. మంగళవారం స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో ఏర్పాటు చేసిన 2కె రన్‌ను కలెక్టర్ సంతోష్ జెండా ఊపి ప్రారంభించారు. క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉద్యోగులతో కలిసి జిల్లా కలెక్టర్ 2కే రన్‌లో పాల్గొని ఉత్సహ పరిచారు. పట్టణ ప్రధాన రహదారుల వెంటా రన్ సాగింది. అనంతరం రాజీవ్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. చదువుతో పాటు నిత్యం కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. క్రీడాకారుల ప్రతిభ వెలికి తీసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్ నర్సింగరావు, మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఇందుకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు, ఉదండాపూర్, వల్లూరు, కిష్టారం గ్రామాల నిర్వాసితుల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఆయన దృష్టికి వచ్చిన సమస్యలపై విచారించి నివేదికను సమర్పించాల్సిందిగా ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్అండ్ఆర్ కమిషనర్ దేవునిగుట్టతండా సమీపంలో ఏర్పాటు చేస్తున్న పునరావాస కేంద్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో పలు అంశాలపై చర్చించి వివరాలు సేకరించారు. పునరావాస కేంద్రంలో మౌలిక సౌకర్యాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ప్యాకేజీ రెట్టింపు చేసి ఇవ్వాలి..

నిర్వాసితులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. 2021లో తక్కువ ధరలు చెల్లించి తమ భూములను తీసుకున్నారని, ప్రస్తుతం బహిరంగమార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని కోరారు. వల్లూరు, ఉదండాపూర్ పరిధిలోని భూములకు తక్కువ ధరలు, పోలేపల్లి పరిధిలోని భూములకు ఎక్కువ ధర ఇచ్చారని అన్నారు. ఒకే రిజర్వాయర్ పరిధిలో రెండు రకాలుగా ధరలను కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.16,30,200ను రెట్టింపు చేసి ఇవ్వాలని కోరారు. 18 ఏళ్లు నిండిన వారికి రూ.6.50 లక్షలు కాకుండా రూ.20 లక్షలు ఇవ్వాలని, నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

ప్రజల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్ అధికారంలోకి..



అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కుటుంబసభ్యులు

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్
- జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు



అలంపూర్ ఆలయాల్లో టీపీసీసీ అధ్యక్షుడికి స్వాగతం పలుకుతున్న అర్చక స్వాములు

అలంపూర్: రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఆయన కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఏ సంపత్‌కుమార్ టీపీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా ఆయన ఆలయాలకు చేరుకున్నారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి అర్చకస్వాములుతో కలిసి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన బాలబ్రహ్మేశ్వర స్వామి, శ్రీజోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. 2023 డిసెంబర్ 3న ఫలితాలు వెలువడ్డాయని, ఈ రోజుతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు వాగ్దానాలు ఇవ్వడం తప్పా చేసింది ఏమి లేదన్నారు. బీఆర్ఎస్ చెప్పుకుంది రూపాయ చారణ అయితే చేసింది చారణ మాత్రమే అన్నారు. అందుకు తగ్గట్టుగా వారు పదేళ్లలో చేయలేని కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 మాసాల్లోనే చేపట్టినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్లలో రూ.17 వేల కోట్ల రుణ మాఫీ చేస్తే కాంగ్రెస్ పార్టీ ఏడాదిలోనే రూ.18 వేల కోట్ల రుణ మాఫీ చేసిందన్నారు. ఏడాదిలో కోటి 25 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుకున్నారన్నారు. నీళ్ల, నిధులు, నియామకాల పేరిట తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబానికి తప్పరాష్ట్రంలో ఎవరికి ఉద్యోగాలు రాలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇప్పటికే 54 వేల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రేమ దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల వేల కోట్ల అప్పు నెత్తిన పెట్టినప్పటికీ ఒక్క హామీని జరవిరుచకుండా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల మన్నలు పొందుతున్న కాంగ్రెస్ పార్టీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లకు తగ్గకుండా రెండవసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. అలాగే కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధాని అవుతారని పేర్కొన్నారు. అలంపూర్ పెద్ద పుణ్యక్షేత్రమని, మరింత గొప్పగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు మాజీ జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిని శేషావస్త్రాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

స్వచ్ఛ గ్రామాలు ప్రతిఒక్కరి బాధ్యత



దాసర్‌పల్లిలో పాఠశాల వంటగది పరిసరాలను పరిశీలిస్తున్న డీపీఓ శ్యాంసుందర్

మల్దకల్: గ్రామ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని డీపీఓ శ్యాంసుందర్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని దాసర్‌పల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. పంచాయతీ కార్మికులు మురుగు కాల్వలను, పురవీధులను, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లలో నుంచి వచ్చే మురుగు రోడ్లపై ప్రవహించకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. అనంతరం పాఠశాల వంటగది పరిసరాలు, పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం



శాంతినగర్‌లో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

శాంతినగర్: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో బీజేపీ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవడం కోసం ఎన్నో హామీలు ఇచ్చి ఏడాది పూర్తయినా వాటిని నెరవేర్చలేదన్నారు. 2023లో ఆరు గ్యారెంటీలు, 66 మోసాల పేరుతో గద్దెనెక్కి ఏ ఒక్క గ్యారెంటీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇలా ఎన్నో హామీలు ఇచ్చి అమలు మరిచారన్నారు. ఇక ఆర్డీఎస్‌కు చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తామని, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని, మల్లమ్మకుంట, వల్లూరు, జూలెకల్ రిజర్వాయర్లను పూర్తిచేస్తామని, అయిజలో డిగ్రీ, బాలికల కళాశాల, అలంపూర్ చౌరస్తాలో బస్సుడిపో, అయిజలో బీసీ బాలికలకోసం పోస్ట్ మెట్రిక్, జిల్లాలో రహదారుల ఆధునీకరణ ఇలా ఎన్నో హామీలు గుప్పించారని, ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. వారి వైఫల్యాలను ప్రతి బీజేపీ కార్యకర్త ఎండగడుతూ ప్రజలకు చేరవేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పెద్ద ఎత్తున పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, కేకే రెడ్డి, మధుసూదన్‌గౌడ్, రాజశేఖరవర్మ, ఈశ్వర్, నాగమల్లయ్య, నాగేశ్వర్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న

అలంపూర్: షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన 48 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఏడాది కావస్తున్నా ఇప్పటికి 23 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి రుణమాఫీ చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 18 లక్షల మంది రైతులు రుణమాఫీ పథకం లబ్ధి జరగడం లేదన్నారు. సీఎం రేవంతర్‌రెడ్డి బ్యాంకులో రూ.2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతులు మిగిలిన రుణం చెల్లిస్తే ప్రభుత్వం రూ.2 లక్షలు రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారని, అందుకు తగ్గట్టుగా రైతులు ఎక్కువ ఉన్న రుణం చెల్లించి రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మిగిలిన రైతులకు రుణ మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రైతులు తిరుపాలు, గణేష్, ఖాజ హుస్సేన్, మద్దిలేటి, నరహరి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గోపాల్‌పేట: విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని మున్ననూరులో మంగళవారం చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్ కథనం ప్రకారం.. మున్ననూరు గ్రామానికి చెందిన వలిగి యాదమ్మ(41) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం తన ఇంటికి వచ్చే కరెంట్ సర్వీస్ వైరుకు ఉండే జే వైరు తెగి కిందపడి ఉండటం గమనించిన యాదమ్మ వైర్‌ను పక్కకు పెట్టేందుకు ప్రయత్నించింది. అయితే అప్పటికే ముసురు వర్షం పడి ఉండటంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఇంటి పక్క నుంచి వెళ్తున్న వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వచ్చి చూసే వరకే మృతిచెందింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్‌లోడ్ చేసేందుకు వచ్చి అనంతలోకాలకు..

రాజాపూర్(బాలానగర్): ఓ పరిశ్రమలో ముడి సరుకు అన్‌లోడ్ చేసేందుకు వచ్చిన లారీ డ్రైవర్ రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు. ఈ ఘటన బాలానగర్ మండలం పెద్దాయపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపాజీ వివరాల మేరకు.. కర్నూల్ జిల్లా డోన్ మండలం ఎర్రకుంట్ల గ్రామానికి చెందిన డ్రైవర్ ప్రవీణ్ కుమార్ (35) లారీలో ముడి సరుకుతో పెద్దాయపల్లి శివారులోని ఓ పరిశ్రమకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని పెద్దాయపల్లి క్రాస్‌రోడ్డు వద్ద టీ తాగేందుకు లారీని నిలిపి, రోడ్డు దాటుతుండగా.. వనపర్తి నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న క్రూజర్ ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తలనొప్పి భరించలేక బాలుడి ఆత్మహత్య


విజయ్‌కుమార్ (ఫైల్)

చిన్నచింతకుంట: పురుగుల మందుతాగి బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నచింతకుంట మండలం మద్దూరులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆర్ శేఖర్ వివరాల ప్రకారం.. చిన్నచింతకుంట మండలం మద్దూర్ గ్రామానికి చెందిన గువ్వల విజయ్‌కుమార్(17) కొంతకాలంగా బ్రేయిన్ ట్యూమర్‌తో బాధ పడుతూ చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఉదయం భ రించలేని తలనొప్పి రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడే మృతి చెందాడు. బాలుడి తల్లి గువ్వల మన్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పితో మరో వ్యక్తి..

శాంతినగర్: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వడ్డేపల్లి పురపరిధిలోని పైపాడులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పైపాడుకు చెందిన కురువ కృష్ణ (46) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం ఇంటికి తాళం వేసి పొలం పనికి వెళ్లాడు. రాత్రి 7 గంటలైనా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు కృష్ణ కోసం ఊరంతా వెతికారు. చివరికి పొలం సమీపంలోని సుబాబుల చేలో కృష్ణ పురుగుల మందు తాగి చనిపోవడంతో మృతదేహం కనిపించింది. ఆయన తండ్రి రాముడు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

మనస్తాపంతో వివాహిత..

అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లిలో మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ పి.శ్రీనివాసులు కథనం ప్రకారం...గ్రామానికి చెందిన ప్రకాష్‌కు 2018లో బిజినపల్లి మండలం సల్కెలాపురం గ్రామానికి చెందిన గీత(24)తో వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం ఉన్నారు. కొన్నేళ్ల నుంచి భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో జీవితంపై విరక్తి చెందిన గీత.. సోమవారం ఇంటి వద్ద బాత్‌రూంలో ఉరేసుకుంది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. అత్తారింటి వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి సుశీల మంగళవారం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్‌లోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కోయనగర్‌కు చెందిన రాకుల శ్రీనివాసులు(45) సోమవారం అర్ధరాత్రి కోయనగర్‌లో కిందపడి పోయాడు. నోరు, ముక్కులో నుంచి రక్తస్రావమైంది. కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం చూసేసరికే మృతిచెందాడు. మృతుడి చెల్లెలు సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పులు తీర్చేందుకు హత్య

- బంగారం వ్యాపారి హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు
- రూ.70 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం


వనపర్తిలో హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: వ్యాపారంలో వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు తోటి వ్యాపారిని హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం సాయంత్రం వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ విలేకరులకు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన దీపక్‌మాలి నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో ధనలక్ష్మి నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన అవ్వారు శేషు(43) అనే వ్యక్తి తయారు చేసిన బంగారం, వెండి ఆభరణాలను హోల్‌సేల్ ధరలకు సరఫరా చేస్తూ.. నెలకు ఒకట్రెండు సార్లు ఈ ప్రాంతంలోని బంగారం వ్యాపారుల వద్దకు వస్తుండేవాడు. అదే తరహాలో గత నెల 20న బిజినేపల్లికి వచ్చి దీపక్ మాలికి కొన్ని ఆభరణాలు ఇచ్చాడు. అయితే అతని వద్ద పెద్దమొత్తంలో బంగారం, వెండి, నగదు ఉన్నట్లు గమనించిన దీపక్ తన అప్పులు తీర్చుకునేందుకు వాటిని కాజేయాలని ఆలోచించి రాజస్థాన్‌లోని జైపూర్‌లో బంగారం వ్యాపారం చేసే తన తమ్ముడు రమేష్ మాలితో ఫోన్‌లో మాట్లాడి పథకం రచించాడు. అతనికి తోడుగా మరో ఇద్దరు వ్యక్తులు జగదీష్ బార్వాడ్, ముఖేష్ మేఘ్వాల్‌ను విమానంలో రప్పించాడు.

పాత బాకి ఇచ్చి..

నవంబర్ 21న వ్యాపారం నిమిత్తం బిజినేపల్లి ప్రాంతానికి వచ్చిన అవ్వారు శేషు తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని దీపక్ మాలికి ఫోన్ చేశాడు. దీంతో దీపక్ తన బొలెరోలో రాజస్తాన్ నుంచి వచ్చిన ముగ్గురిని మంగనూర్ శివారులోని ఆంజనేయస్వామి గుడివద్ద దింపేసి, బిజినేపల్లికి వచ్చాడు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో తన దుకాణం దగ్గరికి వచ్చిన బంగారు వ్యాపారి శేషుకి తాను ఇవ్వాల్సిన పాత బాకీ డబ్బులు రూ.6.50 లక్షలు ఇచ్చి తాను కూడా మహబూబ్‌నగర్ వెళ్తున్నానని చెప్పి శేషును తన బొలెరోలో ఎక్కించుకుని వచ్చారు. అయితే దారిలో తన మనుషులను వాహనంలో ఎక్కించుకున్నాడు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత నిందితులు జగదీశ్, రమేష్‌లు శేషును చేతులతో గట్టిగా పట్టుకుని స్పృహ కోల్పోయేలా చేశారు. శేషు చేతిలో ఉన్న ఫోన్‌ను తీసుకొని హైవేపై వెళ్తూ.. నీళ్లున్న చోట వాగులో పడేశారు. అనంతరం చిన్నంబావి మండలం వెలగొండ శివారు ప్రాంతానికి చేరుకుని శేషును నలుగురు కలిసి బొలెరో వాహనంలోనే.. టవల్‌తో ముక్కు, నోరు మూసి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసి రోడ్డు పక్కనే గుంతలో మృతదేహాన్ని పడేసి వెళ్లారు. సాక్ష్యం ఉండకూడదని శేషు బ్యాగ్‌లో దుస్తులు, వస్తువులు పెట్టి గోపాల్‌పేట మండలం బుద్దారం గండి చెరువులో విసిరేశారు.

గ్రామ కార్యదర్శి ఫిర్యాదుతో..

వెలగొండ గ్రామ కార్యదర్శి వినేష్‌కుమార్ గుర్తుతెలియని శవంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ, ఏఎస్పీ సారథ్యంలో విచారణ జరిపారు. ఈ క్రమంలోనే హత్యకు పాల్పడిన వారిని గుర్తించి రాజస్థాన్‌కు వెళ్లి అరెస్టు చేసి తీసుకువచ్చినట్లు ఎస్పీ తెలిపారు. వారి వద్ద దోచుకున్న బంగారం, వెండి, నగదు మొత్తం స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభకనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ రామదాసు తేతావత్, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి


రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గంలోని వివిధ రూట్లకు బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన అనంతరం నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలోని చాల రూట్లలో బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ప్రయాణికుల రద్దీ మేరకు బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వన్యప్రాణి బోర్డు సభ్యుడిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్: తెలంగాణ రాష్ట్ర వన్యప్రాణుల బోర్డు నూతన కమిటీలో కీలక సభ్యుడుగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు స్థానం దక్కడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంబు వెంకటరమణ, ఎంఏ రహీం, పెర్ముల వెంకటేశ్వర్లు, నంది హన్మంత్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద టైగర్ రిజర్వు ప్రాంతంలోని వన్యప్రాణి సంరక్షణలో నల్లమల ప్రాంతానికి ప్రాధాన్యత చోటు చేసుకోవడం విశేషం అన్నారు. ఈ క్రమంలో నల్లమల ప్రాంతంలోని అచ్చంపేట నియోజకవర్గం ఉండటంతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు వన్యప్రాణి బోర్డులో సభ్యుడుగా ప్రాధాన్యత కల్పించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమాలు చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు చూపుతున్న బాధితులు

కోస్గి: గ్రామంలో మహిళా సంఘాల పేరుతో బ్యాంకు రుణాలు తీసుకొని పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడ్డారని గ్రామ సంఘం అధ్యక్షురాలిపై బాధిత మహిళలు కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో మహిళా సంఘాల పేర్లపై స్త్రీనిధి రుణాలు తీసుకొని, బ్యాంకులో అధికారితో కుమ్మక్కై సుమారు రూ.50 లక్షలకు పైగా అక్రమాలు చేశారని, ఈ విషయంలో మహిళలు అడిగితే 'లోన్ మొత్తం నేనే చెల్లిస్తాను, మీకేం హక్కు' అంటూ, 'నేను ఓ పార్టీకి జిల్లా అధ్యక్షురాలిని' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చనిపోయిన వారి పేరుతో సంతకాలు చేసి లక్షల రూపాయల రుణాలు తీసుకున్నారని, గ్రామ సంఘం అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డిపై గతంలో అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ నోటీసులు ఇచ్చారని, ఈ విషయంలో బ్యాంకు అధికారి, గ్రామ సంఘం అధ్యక్షురాలిపై సమగ్ర విచారణ చేసి పేద మహిళలకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై వివరణ కోసం గ్రామ సంఘం అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

ఎరుకల కార్పొరేషన్‌ను ప్రకటించాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎరుకలకు ఇచ్చిన హామీ మేరకు ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్సారి కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం నూతన జిల్లా కమిటీ ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణ, సభ్యత్వ నమోదు, నూతన మండల కమిటీల ఏర్పాటు, ఎరుకల సమస్యలపై సమాలోచన వంటి అంశాలపై చర్చించారు. త్వరలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎరుకల గర్జన బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎం.బాలయ్య, సీనియర్ నాయకుడు అల్లీపూర్ రాంచంద్రయ్య, రాములు, ఎల్సారి రాంచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పక్కదారి

- కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ అధికారికి మెమో జారీ


కేజీబీవీలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బిజినేపల్లి: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం రెండు సంచుల పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టాయి. కేజీబీవీలో వృథా అయిన ఆహారంతో పాటు రెండు సంచుల్లో పీడీఎస్ బియ్యాన్ని పందులకు ఆహారం పేరుతో ఆటోలో తరలించారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అయితే పీడీఎస్ బియ్యానికి పురుగులు పట్టి, సంచుల నుంచి కారిపోయాయనే సాకుతో పందులకు ఆహారంగా అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఈ విధంగా గతంలో చాలా సార్లు చెత్తా చెదారం పేరుతో ఇతరాత్ర ఆహార పదార్థాలను ఆటోలో అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే వారు లేరని.. కేజీబీవీలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి డీఈఓ రాజశేఖర్‌రావు, బిజినేపల్లి ఎంఈఓ రఘునందన్‌రావు కేజీబీవీకి చేరుకొని వివరాలు సేకరించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మికి మెమో జారీ చేశారు. పీడీఎస్ బియ్యంలో చెత్త ఉందని, పురుగులు పట్టాయని ఇష్టానుసారంగా ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

క్రషర్‌లో పేలుడు పదార్థాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

గండేడ్/మహమ్మదాబాద్: క్రషర్ నిర్వాహణకు పేలుడు పదార్థాలు నిల్వ చేసుకున్నారన్న సమాచారం మేరకు పోలీసులు తనిఖీ నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. గండేడ్ మండలంలోని కప్లాపూర్ సమీపంలోని క్రషర్ మిషన్ నడుస్తోంది. ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో మహమ్మదాబాద్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పలు రకాల పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొని సేఫ్ కస్టడీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

వేరుశనగలో కుళ్లు తెగులు


వేరుశనగలో కాండం తెగుళ్లుతో ఆశించి బూజు పట్టిన మొక్క

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ఈ ఏడాది పప్పుశనగ పంట సాగు పెరిగింది. వానాకాలంలో అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టాల్లో ఉన్నారు. రెండో పంటగా రబీలో సాగు చేసిన వేరుశనగ సాగు చేస్తున్నారు. వేరుశనగ పంటకు కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచించారు. జిల్లాలో అక్కడక్కడ సాగు చేసిన పంటలకు కాండం కుళ్లు తెగులు ఆశిస్తే నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కాండం కుళ్లు తెగులు ఆశించి తీవ్ర నష్టాలను కలిగించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కాండం కుళ్లు ఆస్పర్ జిల్లస్ అనే శీలింద్రం వల్ల ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిలింద్రాలు మొక్క కణాలు, భూమిలో ఉంటాయని వివరించారు. ఈ కణాలను కొనిడియా అని పిలుస్తారని రైతులకు సూచించారు. ఈ కొనిడియా గింజ నుంచి మొలక వచ్చిన వెంటనే భూమికి దగ్గరగా ఉండే కాండంకు ఆశిస్తుందని తెలిపారు. కాండంపై నల్లటి రంగు లేదా గోదుమ రంగు మచ్చలు ఏర్పడి అక్కడ అంత తెల్లటి బూజు లాంటి పదార్థం తయారై మొక్క చనిపోతుందని సూచించారు.

మూడు దశల్లో తెగుళ్లు..

వేరుశనగలో కాండం కుళ్లు తెగులు మూడు దశల్లో ఆశిస్తాయి.

- గింజ భూములో ఉన్నప్పుడు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది.
- మొక్క మొలకెత్తిన 20 నుంచి 25 రోజుల్లో తెగులు ఆశించే అవకాశం ఉంటుంది.
- మొక్క 60 నుంచి 65 రోజుల్లో ఉన్న సమయంలో ఈ తెగుళ్లు ఆశిస్తాయి.

నివారణ..

కాండం తెగులు ఆశించిన పంటకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి, కార్బండిజమ్ మరియు మాంకోజెబ్ గ్రాము లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల తడిచేలా వారానికి రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

అంకితభావంతో సేవలందించాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

జడ్చర్ల: నూతనంగా విధుల్లో చేరుతున్న పోలీసులు అంకితభావంతో ప్రజలను సమన్వయం చేసుకుంటూ వారితో మమేకం కావాలని ఎస్పీ జానకి పేర్కొన్నారు. ఇటీవల పోలీసు శిక్షణను పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించిన 169 మంది కానిస్టేబుళ్లు విధుల్లో చేరుతున్న సందర్భంగా మంగళవారం జడ్చర్ల డీటీసీలో వారికి దిశానిర్దేశం చేశారు. పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలని, క్రమశిక్షణతో తమ వద్దకు వచ్చే బాధితులకు భరోసా ఇవ్వాలని తెలిపారు. నీతి, నిజాయితీగా సేవలు అందించి సమాజంలో పోలీస్‌శాఖ కీర్తిని మరింతగా పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నో సమస్యలతో సతమతమయ్యే వారు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తారని, అలాంటి వారి పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ప్రలోభాలకు ఎక్కడా తావివ్వవద్దని, చట్టపరిధిలో ప్రజలకు న్యాయం చేసే విధంగా వ్యవహరించాలని కోరారు. ఉన్నతాధికారులు అప్పగించిన బాధ్యతలను తప్పకుండా పాటించాలని, టీం వర్క్‌గా ముందుకు సాగాలన్నారు. ప్రజల హక్కులకు ఎక్కడా భంగం వాటిల్లకుండా చూడాలన్నారు. వృత్తిపరంగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించడంలో వినియోగించాలని తెలిపారు. మంచిపేరు సంపాదించాలని, ఆర్థిక క్రమశిక్షణ కూడా పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ సురేశ్ కుమార్, డీటీసీ డీఎస్పీ నర్సిములు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై విచారణ

ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ

- వివరాలు వెల్లడించిన జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి సిద్దప్ప


శివ బాలాజీ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు

గద్వాల క్రైం: ముక్కు సమస్య వల్ల చికిత్సకోసం వచ్చిన మహిళకు వైద్యులు శస్త్ర చికిత్స చేసే క్రమంలో పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన విధితమే.. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్యశాఖ జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి సిద్దప్ప ఆస్పత్రిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. అయిజ పట్టణానికి చెందిన బుడగజంగాల కవిత (36) గత నెల 28న ముక్కులో పెరిగిన కండ సర్జరీ కోసం గద్వాల పట్టణంలోని శివ బాలాజీ ఆస్పత్రికి వెళ్లింది. వైద్యుడు శ్రీనివాస్‌గౌడు శస్త్ర చికిత్స చేస్తున్న సమయంలో మహిళ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రైవేటు ఆస్పత్రికి అదేరోజు తరలించారు. రెండురోజులు అక్కడే చికిత్స పొందుతూ మహిళ ఆదివారం మృతి చెందింది. ఆమె మృతిపై మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఆస్పత్రిని సీజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు హర్షవర్ధన్‌గౌడు, హేమలత, శ్రీనివాస్‌గౌడులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి, ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశారు. రోగికి అందించిన ట్రీట్‌మెంట్ కేషీట్, మందుల నివేదికల ఆధారంగా విచారణ ఉంటుందన్నారు. నోటీసులకు సవివరణాత్మక వివరణ ఇచ్చే వరకు తాత్కాలికంగా సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి ప్రసూనరాణి, మధుసూదన్‌రెడ్డి, తిరుమలేష్‌రెడ్డి, నరసయ్య, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలి


ఉపాధ్యాయులతో వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల టౌన్: ఉపాధ్యాయులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని, వాటిని అరికట్టాలని తెలంగాణ పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్ అన్నారు. సోమవారం బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ వడెన్నపై ఓ విద్యార్థి తండ్రి దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. వీరికి పీఈటీలు, పీడీలు, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం పలికారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ పాఠశాలల్లో క్రమశిక్షణ నేర్పేందుకు పీడీలు, పీఈటీలు కృషిచేస్తుంటారని, అలాంటి వారిపైనే దాడిచేయటం సరికాదన్నారు. దాడికి కారణమైన వ్యక్తి పాఠశాలలో అనేకమార్లు ఉపాధ్యాయులతో దుర్భాషలాడారని, మళ్లీ మళ్లీ దురుసుగా ప్రవరిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్, తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్, పీఆర్టీయూ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంల అధ్యక్షుడు అనంతప్ప, ఎస్టీయూ కార్యదర్శి తాహెర్, యూటీఎఫ్ మన్యం మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడులు అరికట్టాలని, భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా ఉండాలంటే దాడిచేసినారిని కఠినంగా శిక్షించాలన్నారు.

ఉపాధ్యాయులతో చర్చించిన డీఈఓ

ఉపాధ్యాయుల నిరసన గురించి తెలుసుకున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. నిరసన విరమించాలని, పోలీసు అధికారులతో మాట్లాడి ఘటనకు బాధ్యులైన వ్యక్తిపై చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఉపాధ్యాయులు నిరసన విరమించారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు ఇబ్రహీం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.